నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 17 మే 2024 | RANGAREDDY

## ఆధారాలు చూపిస్తే నగదు విడుదల చేస్తాం

**192 కేసులకు సంబంధించి రూ.5.93 కోట్లు రిలీజ్ చేశాం**

**ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్**

సిటీబ్యూరో, మే 16, (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 201 కేసులలో రూ.50 వేలకు మించి ఆధారాలు లేని రూ.8,48,65,710 నగదుకు సంబంధించి జిల్లా గ్రీవెన్స కమిటీకి సిఫారసు చేయగా, 192 కేసులకు చెందిన రూ.5.93కోట్లను డీజీసీ ద్వారా విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. సీజ్ చేసిన నగదులో రూ.10 లక్షలకు మించి పట్టుబడిన ఆరు కేసులకు సంబంధించి రూ.1,88,86,938 ఆదాయ పన్ను, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఆదే విధంగా మూడు కేసులలో రూ. 66, 49,000 ఆదాయ పన్ను శాఖ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

## స్ట్రాంగ్ రూంల పరిశీలన

రంగారెడ్డి, మే 16(నమస్తే తెలంగాణ) : చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పోల్డ్ ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను వెబ్ కాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా కలెక్టర్ శశాంక గురువారం పరిశీలించారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్ ముగిసిన అనంతరం మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటింగ్ యంత్రాలను బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో భద్రపర్చారు. వీటిని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక ఒక్కో స్ట్రాంగ్ రూంను వెబ్ కాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా పరిశీలించారు. వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలు, వాటి పరిసరాలలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను గమనించారు. నిరంతరం నిఘా కోసం అమర్చిన క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరు, వాటి ద్వారా కొనసాగిస్తున్న పర్యవేక్షణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట చేవెళ్ల ఆర్డీఓ సాయిరామ్, కందుకూర్ ఆర్డీఓ సూరజ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# బోనస్..బోగస్



ధారూరు మండలం గట్టేపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అన్నదాతలు



మహేశ్వరంలో నిర్వహించిన రాస్తారోకోలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

- సన్నరకం వడ్లకే రూ.500 బోనస్ ఇస్తామని సీఎం రేవంత్ మెలిక
- 'చెయ్యి'చ్చిన కాంగ్రెస్‌పై మండిపడ్డ రైతాంగం
- కేసీఆర్ పిలుపు మేరకు పిడికిలెత్తిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు నియోజకవర్గ కేంద్రాల్లో వెల్లువెత్తిన నిరసనలు
- రైతుల పొట్టగొట్టే ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వంపై నేతలు, రైతుల ఆగ్రహం
- కాంగ్రెస్ రైతులను మరోసారి వంచించింది : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

### కాంగ్రెస్ రైతులను మరోసారి వంచించింది..

**- సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే**

మహేశ్వరం గేట్ వద్ద శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై గురువారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సన్న రకం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి రైతులను వంచించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఒక్క హామీనీ నెరవేర్చలేదని, వరి ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి..పార్లమెంట్ ఎన్నికలు కాగానే సన్నరకం వడ్లకే ఇస్తామని చెప్పి రైతులను దగా చేశారన్నారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తారని, ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడం.. ఇంతకంటే మోసం మరొకటి లేదన్నారు. సన్నరకం వడ్లకే ఇస్తామని ఎన్నికలకు ముందే చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్ పార్టీని తుక్కుతుక్కుగా ఓడించేవారని, ఇప్పటికీ రైతులు కాంగ్రెస్‌పై ఆగ్రహంతోనే ఉన్నారన్నారు. యాసంగి ధాన్యాన్ని కొనకుండా రైతులను ఈ సర్కారు గోస పెడుతున్నదన్నారు.

రంగారెడ్డి, మే 16 (నమస్తే తెలంగాణ): ధాన్యానికి బోనస్‌పై ఆశలు పెట్టుకున్న రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చెయ్యి చ్చింది. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారు. కేవలం సన్న రకం వడ్లకే చెల్లిస్తామని మోసం చేశారు. 'ఓట్ల ముందు ఓడమల్లన్న ..ఓట్లయ్యాక బోడి మల్లన్న' అన్నట్లుగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే నాలుక మాడతేయడంపై కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ మరోసారి పిడికిలెత్తింది. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో గులాబీ దళం రైతులకు బాసటగా నిలిచింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, షాద్‌నగర్, వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు రైతులతో కలిసి గురువారం నిరసనలు చేపట్టారు. రైతు వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. మహేశ్వరంలో ని ర్వహించిన నిరసనలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. రైతులను మరోసారి కాంగ్రెస్ వంచించిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధారూరు మండలం, గట్టెపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి.. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. సన్న, దొడ్డు అనే తేడా లేకుండా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిగి నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, తాండూరు మం డలంలోని చెంగోల్‌లో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజూగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు మద్దతుగా నిరసన తెలిపారు.

### ఐదు నెలల్లో..రైతు బతుకు ఆగమాగం..

కాంగ్రెస్ వంద రోజుల పాలనలో వ్యవసాయ రంగం అగమ్యగోచరంగా మారింది. సాగునీటి వనరుల్లో నీరు అడుగంటి కరువు తాండవించింది. పంటలకు తడి అందక ఎండిపోయి పశువులకు మేతగా మారింది. కొన్ని ప్రాంతాల్లో దిగుబడులు సైతం వచ్చే పరిస్థితి లేక రైతుల కష్టం బుగ్గిపాలైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరువు అనే మాట లేక పోగా..కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కష్టాలు రైతులను వెక్కిరిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో రైతుభరోసా, రుణమాఫీ హామీలిచ్చి రైతులను నమ్మించిన కాంగ్రెస్.. మాట నిలుపుకోకపోవడంతో రైతు కుటుంబాలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. చేతికొస్తున్న కొద్దిపాటి పంటలను సైతం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతాంగం అష్టకష్టాలు పడుతున్నది. ఓ వైపు సాగు కష్టాలు, మరోవైపు కరెంట్ కోతలతో పదేండ్లుగా మాయమైపోయిన రైతు కష్టాలు నేటి కాంగ్రెస్ పాలనలో మళ్లీ ప్రత్యక్షమై రైతు బతుకులను ఛిద్రం చేస్తున్నాయి.

### బోనస్ ఇచ్చే వరకూ కొట్లాడుడే..

రైతు ప్రయోజనాలే ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం పండిన ప్రతి గింజనూ కొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం ధాన్యా న్ని అమ్ముకోవడం రైతులకు సవాల్‌గా మారింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యా న్ని కొనేందుకు కొర్రీలు పెడుతుండడంతో విధిలేక రైతులు వ్యాపారులు, దళారులకు అమ్ముకుంటున్నారు. యాసంగిలో పంటలు ఎండిపోగా..పండిన కాస్తంత పంటకైనా బోనస్ ఇచ్చి ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇది ఎన్నికల నాటి హామీయే అయినా పట్టించుకోవడం లేదు. ఎన్నికలు ముగిశాక..సీఎం రేవంత్ రైతులకు చావు కబురును వినిపించారు. కేవలం సన్న రకం వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పి రైతుల్లో కొద్దిపాటిగా మిగిలిన ఆశపై నీళ్లు చల్లారు. సీఎం మాటలతో బోనస్ హామీ బోగసేనని తేలిపోయిందని రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. సన్న రకం వడ్లకు బోనస్ ఇచ్చి దొడ్డు రకం వడ్లకు ఇవ్వకుంటే రైతుల పొట్టకొట్టినట్లేనని అన్నదాతల కుటుంబాలు, రైతు సంఘాల ఆవేదన చెందుతున్నాయి. గురువారం మహేశ్వరం, షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు రైతాంగం పెద్ద ఎత్తున తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన గళాన్ని వినిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చి సన్న రకం వడ్లతోపాటు దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ ఇస్తామని ప్రకటించే వరకూ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి.



ధారూరు : నిరసన తెలుపుతున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నేతలు



పరిగి: నిరసనలో పాల్గొని ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

## మళ్లీ తెరపైకి అవిశ్వాసం!

- కాంగ్రెస్ చైర్‌పర్సన్‌ను స్వచ్ఛందంగా తప్పించే ప్రయత్నాలు
- లేదంటే అవిశ్వాసం ప్రక్రియతో ముందుకెళ్లే సన్నాహాలు
- ఎమ్మెల్యే హామీతో మారనున్న పెద్దఅంబర్‌పేట రాజకీయాలు

పెద్దఅంబర్‌పేట, మే 16 : పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో అవిశ్వాసంపై మళ్లీ చర్చ మొదలైంది. 'హామీ ఇస్తున్నా.. త్వరలోనే మార్పు తథ్యం' అని నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీతో మరోసారి రాజకీయం వేడెక్కింది. ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నను స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పించి.. పెద్దఅంబర్‌పేటకు చెందిన కౌన్సిలర్‌కు ఆ బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్‌కు చెందిన మెజారిటీ కౌన్సిలర్లు నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకు బీఆర్ఎస్ కౌన్సిలర్లూ మద్దతు ఇచ్చారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల వేళ జరిగిన సమీక్షా సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస అంశంపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో చర్చించగా.. ఎన్నిక లైన మూడు, నాలుగు రోజుల్లో దానిపై ముందుకెళ్దామని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. అవిశ్వాసం ఎప్పుడా అని నాలుగేండ్లుగా ఎదురుచూస్తున్న కౌన్సిలర్లు 'ఆ టైం వచ్చేసింది..ఇక రేపో.. మాపో ' అని చర్చించుకుంటున్నారు.

### అప్పట్లోనే క్యాంపులకు..

మున్సిపాలిటీలో 24 వార్డులున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 13 సీట్లు, బీఆర్ఎస్ 8, సీపీఐ, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థి ఒక్కో సీటులో గెలుపొందారు. కానీ, కాంగ్రెస్‌లోని 13 మంది కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. ఫలితంగా కాంగ్రెస్‌లోని ఓ వర్గం మద్దతు, ఇద్దరు ఎమ్మెల్సీ ఓట్లతో బీఆర్ఎస్ కౌన్సిలర్ చెవుల స్వప్న చైర్‌పర్సన్ పదవిని కైవసం చేసుకున్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో కాంగ్రెస్ కౌన్సిలర్ సంపూర్ణారెడ్డి వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచే కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉన్నాయి. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసం కోసం గతేడాది జనవరిలోనే ఓ వర్గం కౌన్సిలర్లు గట్టిగా ప్రయత్నాలు చేశారు. క్యాంపులకు సైతం వెళ్లారు. చైర్‌పర్సన్ పదవి కోసం జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ పదవి కోసం కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి పోటీపడ్డారు. మరోవైపు, ఉన్న పదవులు చేజారిపోకుండా వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి వర్గం సైతం క్యాంపులకు వెళ్లింది. కొత్త పురపాలక చట్టం ప్రకారం.. నాలుగేండ్ల వరకు అవిశ్వాసానికి అవకాశం లేకపోవడంతో ఆ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు చైర్‌పర్సన్ స్వప్నతోపాటు మరో బీఆర్ఎస్ కౌన్సిలర్ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. దీంతో కాంగ్రెస్ బలం 15కు చేరింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు హస్తం పార్టీలో చేరడంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 17కు పెరిగింది. చైర్‌పర్సన్ కాంగ్రెస్‌లో చేరినా ఆ పార్టీలోని ఓ వర్గం కౌన్సిలర్లు మాత్రం ఆమెపై అవిశ్వాసం పెట్టాల్సిందేనని ఎమ్మెల్యేకు స్పష్టం చేశారు. ఆ వెంటనే ఎంపీ ఎన్నికల కోడ్ రావడంతో ఎలక్షన్స్ ముందు అవిశ్వాస తీర్మానం పార్టీకి మంచిది కాదనే ఉద్దేశంతో వాయిదా వేసినట్లు తెలుస్తున్నది.

### స్వచ్ఛందం లేదంటే తీర్మానం!

మున్సిపాలిటీలో రాజకీయాలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. గతేడాది చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్‌పర్సన్‌పైనా అవిశ్వాసం పెట్టాలని కోరుతూ కలెక్టర్‌ను కలిశా రు. వివిధ కారణాలతో అది ముందుకు సాగలేదు. ప్రస్తుతం చైర్‌పర్సన్‌పైనే అవిశ్వా సం పెట్టాలని మెజారిటీ కౌన్సిలర్లు పట్టుబడుతున్నారు. అవిశ్వాస ప్రక్రియ లేకుండా నేరుగా స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ విషయాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ద్వారా చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లిన ట్లు తెలుస్తున్నది. పెద్దఅంబర్‌పేట కౌన్సిలర్ జయశ్రీకి చైర్‌పర్సన్ పదవీ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంపై వారం వ్యవధిలో పలువురు కౌన్సిలర్లు పలుమార్లు సమావేశమై చర్చించినట్లు తెలుస్తున్నది. ఒకవేళ చెవుల స్వప్న స్వచ్ఛందంగా తప్పుకోని పక్షంలో అవిశ్వాస తీర్మానం పెట్టాలని భావిస్తున్నా రు. అయితే, గతేడాది చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు తమ వర్గం కౌన్సిలర్ల మద్దతుతో కూడిన పత్రాలను అధికారులకు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసం గతంలో ఇచ్చిన నోటీసులు పనికొస్తాయని, మరోసారి జిల్లా అధికారులను కలిస్తే ఆ ప్రక్రియ పూర్తవుతుందని పలువురు కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. మరోవైపు, అవిశ్వాసంపై ఎలాంటి సమాచారం లేదని, తప్పుకోవాలని తమను ఎవరూ సంప్రదించలేదని, అవన్నీ కొందరు చేస్తున్న దుష్ప్రచారమేనని చైర్‌పర్సన్ స్వప్న స్పష్టంచేశారు.






ధారూరు : నాగారంలోని కొనుగోలు కేంద్రంలో తడుస్తున్న ధాన్యం

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- రంగారెడికి ఎల్లో అలర్టు జారీ
- జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షపాతం 194.7మి.మీలు
- కడ్తాల్ మండలంలో పిడుగుపాటుకు ఒకరి మృతి
- కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం
- ప్రవహించిన కొత్తపల్లి వాగు

## తడిసి ముద్దయిన ధాన్యం

రంగారెడ్డి, మే 16(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను గురువారం వర్షం ముంచెత్తింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లాలో 194.7మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సరూర్‌నగర్‌లో 33.7మి.మీలు కురిసింది. శంకర్‌పల్లి ప్రాంతంలో వాగులు, మురు గుకాల్వలు పొంగిపొర్లాయి. కడ్తాల్ మండలంలోని వాసుదేవ్‌పూర్‌లో పిడుగు పడి ఒకరు మృతి చెందారు. ధారూరు మండలంలోని నాగారంలో కురిసిన వానకు కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దయ్యింది. వడ్లు నీళ్లలో పైకి తేలా యి. చేవెళ్లలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద గొల్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్ ఎండబెట్టిన ధాన్యం వర్షం నీటిలో కొట్టుకుపోయింది. అదేవిధంగా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోకుండా ఉం డేందుకు అన్నదాతలు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షాల నేపథ్యంలో అధికార యం త్రాంగం ప్రజలను అప్రమత్తం చేస్తున్నది. భారీ వర్షాలతో వాతావరణ శాఖ రంగారె డ్డి జిల్లాకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. మరో నాలుగైదు రోజులు భారీ వర్షాలు ఉంటాయని ప్రకటించింది. అత్యవసరమైతే తప్ప ప్రజానీకం ఇండ్లను వదిలి బయటకు రాలేదు.



ధారూరులో..



చేవెళ్ల మండలంలోని ఎంకెపల్లిలో కురుస్తున్న వర్షం



పారుతున్న శంకర్‌పల్లి మండలంలోని కొత్తపల్లి వాగు

### రంగారెడ్డి జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో గురువారం సాయంత్రమే 194.7మి.మీల వర్షం కురువగా.. జిల్లా సగటు వర్షపాతం7.2మి.మీలుగా నమోదైంది. సరూర్‌నగర్‌లో అత్యధికంగా 33.7 మి.మీలు, గండిపేటలో 29.5మి.మీలు, రాజేంద్రనగర్‌లో 28.6మి.మీలు, హయత్ నగర్‌లో 27.7మి.మీలు, శేరిలింగంపల్లిలో 20.9మి.మీలు, శంకర్‌పల్లిలో 13.4మి. మీలు, చేవెళ్లలో 7.7మి.మీలు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 6.9మి.మీలు, ఇబ్రహీంపట్నంలో 5.2మి.మీలు, కేశంపేటలో 4.5మి.మీలు, శంషాబాద్‌లో 4.3మి.మీలు, మొయినాబాద్‌లో 3.5మి.మీలు, కందుకూరులో 3.3మి.మీలు, మహేశ్వరంలో 2.5మి.మీలు, ఫరూఖ్‌నగర్, నందిగామలలో 0.8మి.మీలు, ఆమనగల్లు, బాలాపూర్‌లలో 0.5మి.మీలు, కడ్తాల్‌లో 0.4మి.మీ.ల వర్షం కురిసింది.

## నీటి సంరక్షణలో భేష్

**వికారాబాద్ జిల్లాకు ఐదో జాతీయ వాటర్ అవార్డు**

**జిల్లాలో పర్యటించిన కేంద్ర జలవనరుల శాఖ, భూగర్భ జల బోర్డు సభ్యుల బృందం**

వికారాబాద్, మే 16 : ఐదో జాతీయ వాటర్ అవార్డుకు వికారాబాద్ జిల్లా ఎంపికైందని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. గురువారం కేంద్ర జల వనరుల శాఖ, భూగర్భ జల బోర్డు సభ్యుల బృందం జిల్లాలో పర్యటించి.. నీటి సంరక్షణకు తీసుకున్న చర్యలను అదనపు కలెక్టర్‌తో చర్చించింది. ఈ సందర్భంగా జిల్లా గ్రామీ ణాభివృద్ధి సంస్థ కార్యాలయంలోని జల్‌శక్తి అభియాన్ కేంద్రాన్ని బృందం సభ్యులు సందర్శించారు. అనంతరం వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం, పీఎంకేఎస్‌వై వాటర్‌షెడ్ పథకాల్లో భూగర్భజలాల పెంపునకు చేపట్టిన పనులు, నీటికుంటలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ నీటి ఇంకుడుగుంతలు, కందకాలు, పల్లె ప్రకృతివనాలు, బృహత్ పల్లె ప్రకృతివ నాలు, చెక్ డ్యామ్‌లు తదితర పనులను పర్యవేక్షించారు. నీటి వనరుల వృద్ధిపై గ్రామస్తులతో ఆరా తీసి నీటి సంరక్షణ భేష్ అని కితాబునిచ్చారు. అదేవిధంగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో గంగ్యాడ గ్రామంలో నిర్మించిన చెక్ డ్యామ్‌ను, పూడూరు మండలం లోని మీర్జాపూర్‌లో నిర్మించిన నీటి సంరక్షణ పనులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, జడ్పీసీఈవో సుధీర్, డీపీవో జయసుధ, డీజీ డబ్ల్యూవో దీపారెడ్డి, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, వికారాబాద్ ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో నాగరా జు, పీవో వాటర్ షెడ్ సతీశ్‌రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది, జేఎస్‌ఏ జిల్లా కో-ఆర్డినేటర్ సైదులు, ఐఈసీ నోడల్ అధికారి శ్రీధర్, ఏపీవో శ్రీనివాస్, ఈసీ నవీన్, టీఏ భీమయ్య, క్షేత్ర సహాయకులు కిష్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



భూ గర్భ జలాల పెంపు విధానాన్ని తెలుసుకుంటున్న కేంద్ర జలవనరుల శాఖ, భూగర్భ జల బోర్డు సభ్యుల బృందం